క్లుప్తంగా

మల్లికార్జునస్వామి సన్నిధిలో మంత్రి ఆనం



పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు గ్రామంలోని భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామివారి దేవస్థానాన్ని ఆదివారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో ఉండేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు నాగశర్మ, బాలాజీ, ఉమ, శ్రీనివాస్ శర్మలు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ శరత్‌చంద్ర, కృష్ణాజిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ ఈఓ హరి దుర్గ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న సహాయ కమిషనర్



గుడ్లవల్లేరు: దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని మచిలీపట్నం ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ కరస్పాండెంట్, సహాయ కమిషనర్ చందన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెను సన్మానించి అమ్మవారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదాలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: స్థానిక పెద ఎరికపాడు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పెద ఎరికపాడు, రైలుపేట, బేతవోలు నిమ్మతోట, వాంబేకాలని, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కైకలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33/11కేవీ పల్లెవాడ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

అధ్వానంగా రహదారి



గుడ్లవల్లేరు: మండలంలోని జేమ్స్‌పేట నుంచి కట్టవానిచెరువు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో ఏర్పడిన మోకాలు లోతు గోతుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ నీరు చేరుతోంది. దీంతో వాహన చోదకులు రాకపోకలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దాతల సాయం అభినందనీయం

కైకలూరు: ప్రయాణికుల సౌకర్యార్థం వరసంజీవిని ఆస్పత్రి వైద్యులు పి.పుల్లేశ్వరరావు, పూర్ణచంద్రరావు ఆర్థిక సాయంతో తాలూకా సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బస్ షెల్టర్‌తో పాటు తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గుడివాడ టౌన్: స్థానిక నెహ్రూచౌక్‌లో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 30వ తేది మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఉంటుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

త్రిశక్తి స్వరూపిణీ..

కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

గుడివాడరూరల్: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు 7వ రోజుకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కోతిబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు శ్రీమహాకాళీదేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని వివిధ ఆలయాల్లో పలు రూపాల్లో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయం (పెద్ద శివాలయం)లో, ప్రణవాశ్రమంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా, నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మీ దేవిగా, వెంకటేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మి దేవిగా, గౌరీశంకర స్వామివారి ఆలయంలో మహాగౌరీ దేవిగా, శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహాచండీదేవిగా, శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో మీనాక్షి దేవిగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



కోతిబొమ్మ సెంటర్‌లో శ్రీమహాకాళీదేవిగా అమ్మవారు

మహాచండీగా అలంకరణ

మండవల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆదివారం మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. గురజ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా పూజలందుకున్నారు. దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అదేవిధంగా పెదకామనపూడి, చినకామనపూడి, చిగురుకోట, వడాలి, ఊటుకూరు శివారు నారాయణపురం, పెదగొన్నూరు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణ

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మీగా అలకరించి పూజలు చేశారు. బుచ్చమ్మ ఆశ్రమంలో మంగళగౌరీగా, తోట్లవల్లూరు గ్రామంలో మహాచండీగా అమ్మవారు దర్శనమిచ్చారు.

కైకలూరు: స్థానిక శ్యామలాంబ తల్లి రాజరాజేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ సంతానలక్ష్మీగా పూజలందుకున్నారు. లోకుమూడి దత్తాశ్రమంలో కోటి కుంకుమ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దర్శించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వివిధ రూపాల్లో అమ్మవారు



కొతవరంలో అన్నపూర్ణగా అమ్మవారు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి మంగళగౌరీ దేవిగా, అంగలూరు జ్ఞాన సాయి మందిరంలో మహాచండీగా, కౌతవరం గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో కాశీ అన్నపూర్ణగా, డోకిపర్రులో సౌభాగ్య లక్ష్మీగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా వేమవరంలోని కొండలమ్మ వారి సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



మండవల్లి ఆలయంలో మహాచండీగా అమ్మవారు



గురజ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కాశీ అన్నపూర్ణాదేవి



తోట్లవల్లూరులో మహాచండీగా భ్రమరాంబదేవి



దోకిపర్రులో అమ్మవారికి ఊంజల సేవ



లోకుమూడి దత్తాశ్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

అమ్మవారిని దర్శించుకున్న డీఎన్నార్



అన్నసమారాధనలో పాల్గొన్న డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: స్థానిక పోలీసుస్టేషన్ రోడ్డులోని రామాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ జంపాన కోటయ్య, పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు: భుజబలపట్నంలో ఆదివారం అమ్మవారిని డీఎన్నార్ దర్శించుకున్నారు. స్థానిక ఎంపీటీసీ పెనుమత్స సూర్యనారాయణ రాజు, మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షుడు ఉచ్చుల చినరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణ పనులకు విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి, గంగానమ్మ తల్లి దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు కంభంపాటి రవి, పద్మజ దంపతులు రూ. 25 వేలను ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు ఆదివారం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్య చౌదరి, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం గుర్విందపల్లి గ్రామంలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరానికి ఆదివారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన కనుమూరు లక్ష్మీనరసింహారావు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.4వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

కైకలూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు కూటమి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పిలుపునిచ్చారు. ఇటీవల ముదినేపల్లి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులు పార్టీ కార్యాలయంలో ఆదివారం డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగ అధ్యక్షుడు పరసా ఏసురాజు, మహిళా విభాగ అధ్యక్షురాలు రాచూరి రాధా, రైతు విభాగ అధ్యక్షుడు బత్తుల దాసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాసే జయరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కాగిత హేమంత్, పంచాయతీరాజ్ అధ్యక్షుడు సింగనపల్లి రామకృష్ణ, వలంటీర్స్ అధ్యక్షుడు బోయిన నాగేంద్ర, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు యార్లగడ్డ అంకాలరావు, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు గొల్లంగి దినేష్ బాబు, అంగన్‌వాడీ అధ్యక్షురాలు దోసనపూడి కుమారి, సోషల్ మీడియా అధ్యక్షుడు శొంఠి రాము, ప్రచార అధ్యక్షుడు కొల్లి నాని తదితరులు డీఎన్నార్‌ను కలిశారు. పార్టీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి మండల నాయకులను అభినందిస్తున్న డీఎన్నార్

'డిజిటల్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ

పామర్రు: కూటమి నాయకులతో పాటు అధికారులు కూడా వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే వారికి డిజిటల్ బుక్ అంటే ఏమిటో చూపిస్తామని తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పామర్రులోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ల ఆదేశాల మేరకు అన్యాయానికి గురవుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం రూపొందించిన 'డిజిటల్ బుక్' వాల్ పోస్టర్లను నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులను వేధిస్తున్నారని అన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చట్ట ప్రకారం డిజిటల్ బుక్‌లో ఉన్న వారిని గుర్తించి వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతలపూడి గవాస్కర రాజు, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి నామా వెంకటేశ్వరరావు, పామర్రు, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, రాజులపాటి రాఘవరావు, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ స్థాయి యూత్ వింగ్ అధ్యక్షుడు ఆరుమళ్ల భగవంత్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆరుమళ్ల రమాదేవి, రైతు విభాగం అధ్యక్షుడు మర్రి బాబూరావు, బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొడాలి సురేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సజ్జా సుబ్రహ్మణ్యం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు గుర్రం రామచంద్రరావు, స్టూడెంట్స్ వింగ్ అధ్యక్షుడు చాట్ల రుత్విక్(కిట్టు), ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడు బయవరపు దుర్గా ప్రసాద్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడు సూదులగంటి కోటిప్రసాద్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పొత్తుబోయిన రామకృష్ణ, వాణిజ్య విభాగం అధ్యక్షుడు నీలిశెట్టి శ్రీనివాసరావు, వీవర్స్ వింగ్ అధ్యక్షుడు చిరందాసు వెంకట నరసింహ వేణుగోపాలరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు పునుకొల్లు యశ్వంత్‌చౌదరి, ఐటీ వింగ్ అధ్యక్షుడు కలకోటి అభినవ్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు మట్టా ప్రభు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు దిట్టకవి వెంకట శ్రీనివాసాచారి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు సత్తా రవికుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



పామర్రులో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కవి కోకిల.. గుర్రం జాషువా

మచిలీపట్నం టౌన్: నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మ విభూషణ్ గుర్రం జాషువా జయంతిని మచిలీపట్నం నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మచిలీపట్నంలోని బుట్టాయిపేట జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో జాషువా జయంతిని నిర్వహించారు. సాహితీ ప్రవంతి మచిలీపట్నం కన్వీనర్ పైడిపాటి రాందేవ్ జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, నాయకులు సీహెచ్ రాజేష్, కొడాలి శర్మ, బి.సుబ్రహ్మణ్యం, రాజు, ఎస్ఎస్ నారాయణ, కె.వసంతరావు, పి.ధనశ్రీ, భవాని తదితరులు పాల్గొని నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జాషువా జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ టీచర్ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. జాతి, కుల, మతాలకు అతీతంగా తెలుగు పద్య శిల్పాన్ని మలచిన కవి శిఖామణులలో జాషువా అగ్రగామి అని పేర్కొన్నారు. సాహితీ పరిషత్ అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఉప గ్రంథాలయాధికారి బి.వెంకటరమణ, పరిషత్ కార్యదర్శి ఎం.శాస్త్రి, పాఠకులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ కేంద్రంలో జాషువా చిత్రపటం వద్ద నివాళులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: సత్ప్రవర్తన కలిగి ఉండి నేరాలకు దూరంగా క్రమశిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు రౌడీషీటర్లకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. దొంగతనాలు, గొడవలు, అక్రమ మద్యం, మారకద్రవ్యాల అమ్మకాల వంటి వాటితో పాటు కోతముక్క, కోడి పందాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఎప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవనం ప్రారంభం



వాడవల్లిలో సొసైటీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి రూరల్: మండలంలోని వాడవల్లిలో రూ. 37 లక్షలతో నిర్మించిన వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి గోవర్ధనరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేయాలని సూచించారు. అనంతరం సంఘంలోని సభ్యులైన రైతులకు కర్షకమిత్ర, రైతు నేస్తం, డ్వాక్రా మహిళా రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.



• ఆకాశంలో సోయగం

మండలంలోని సింగలూరులో ఆదివారం చిత్రకారుని కుంచె నుంచి జాలువారిన పెయింట్‌లా నింగిలో రంగు రంగుల అందాలు మనసుల్ని పులకింపజేశాయి. వర్షాలు మోస్తరుగా కురియడంతో సూర్యాస్తమయంలో భానుడిపై మబ్బులు కమ్మేందుకు చేసిన ప్రయత్నం ఒక అందమైన చిత్ర లేఖనంలా ఆకాశంలో కనువిందు చేసింది. ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికుల్ని అలరించింది.

– గుడ్లవల్లేరు

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



నిండుకుండలా కృష్ణమ్మ ప్రవాహం

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలోని కృష్ణానదికి పైనుంచి సుమారు 6లక్షల క్యూసెక్‌ల నీరు వస్తుండటంతో ఆదివారం నది ప్రవాహం ఉధృతంగా మారింది. దీంతో లంక గ్రామాలప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. లంక గ్రామాల్లో ఉన్న వారు పెరుగుతున్న నదీ ప్రవాహానికి తొలుతగా తమ గొర్రెలను పడవలపై తోట్లవల్లూరుకు తీసుకువచ్చి గట్టుకు చేరుస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో ఏడు లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.